సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



గొంతెండుతోంది

భగీరథ పైపులైన్లు పగిలిపోవడం.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. 8లో▸



చరిత్రను వక్రీకరిస్తున్న..

ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాంచందర్ అన్నారు. 8లో▸



వంటశాలలు పరిశుభ్రంగా..

హోటళ్లు, తిను బండరాల దుకాణాల్లో కిచెన్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పర్యావరణాధికారి ఆనంద్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

సీపీ అవినాష్ మహంతి



డీసీపీ, ఏసీపీ, సీఐలతో సమీక్షిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

శంకర్‌పల్లి: పెండింగ్ కేసుల దర్యాప్తును వేగిరం చేసి సత్వరమే పరిష్కారం అయ్యేలా చూడాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. గురువారం ఆయన శంకర్‌పల్లి ఠాణాను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి ఏసీపీ రమణ గౌడ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, రికార్డులు, నేరాలు, శాంతిభద్రతలపై సమీక్షించి, పలు సూచనలు ఇచ్చారు. నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్స్‌కు ఇచ్చే కేసులు, ఆయుధాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ శంకర్‌పల్లిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని మరికొంత మంది సిబ్బందిని కేటాయించాలని కోరగా.. ఇందుకు సీపీ సానుకూలంగా స్పందించారు.

కొందుర్గు తహసీల్దార్‌గా అజాం అలీ



బాధ్యతలు స్వీకరిస్తున్న అజాం అలీ

కొందుర్గు: కొందుర్గు తహసీల్దార్‌గా అజాం అలీ గురువారం విధుల్లో చేరారు. కేశంపేట నుంచి బదిలీపై వచ్చిన ఆయన డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అజాం అలీ మాట్లాడుతూ.. మండల పరిధిలోని భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

అరుణాచల్ టీ-20లో షాద్‌నగర్ యువకుడి సత్తా

ఆల్ రౌండర్‌గా ప్రతిభ చాటిన సునీల్ యాదవ్



కప్‌తో సునీల్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: అరుణాచల్‌ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అరుణాచల్ టీ-20 చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీల్లో ఎలికట్ట గ్రామానికి చెందిన బద్దుల సునీల్‌యాదవ్ సత్తాచాటాడు. గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బద్దుల కృష్ణయ్య, విజయ దంపతుల కుమారుడు సునీల్‌యాదవ్ టవాంగ్ టైటాన్-2025 టీంకు ఎంపిక అయ్యాడు. అరుణాచల్ టీ-20 చాంపియన్ షిప్ పోటీల్లో ఏడు లీగ్ మ్యాచ్‌లు, ఒక సెమీస్‌లో ఆల్ రౌండర్‌గా ప్రతిభను కనబరిచాడు. టవాంగ్ టైటాన్ జట్టు ఫైనల్‌కు చేరి తుది పోరులో రన్నరప్ జట్టుగా నిలిచింది. తెల్లాపూర్‌లోని స్పోర్ట్స్ అండ్ స్పార్క్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సునీల్‌యాదవ్ డిసెంబర్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించనున్న రంజీ మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నాడు. భవిష్యత్‌లో ఐపీఎల్ ఆడాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.

జ్యూస్ తాగుతూ కుప్పకూలిన యువకుడు

ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాత



ఏకలవ్య (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: జ్యూస్ తాగుతుండగా గుండెపోటు రావడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా పల్లిపాడుకు చెందిన మేడ ఏకలవ్య(30) ఇబ్రహీంపట్నంలోని తన స్నేహితుడు ఆకాష్‌పటేల్ వద్ద ఉంటున్నాడు. యూకేలో ఉండే ఏకలవ్య ఉద్యోగం పోవడంతో హైదరాబాద్ వచ్చాడు. అప్పటినుంచి జాబ్ కోసం ట్రై చేస్తున్నాడు. జ్యూస్ సెంటర్ వద్ద కిందపడిపోయిన అతన్ని పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అడ్డుకుంటే అరెస్ట్

నానక్‌నగర్‌లో భారీ పోలీస్ బందోబస్తు నడుమ ఫెన్సింగ్ పనులు

- రైతుల ఆందోళనను పట్టించుకోని అధికార యంత్రాంగం
- అభ్యంతరాలుంటే సీసీఎల్‌లో సంప్రదించాలంటూ సూచన
- పనులను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



ఫెన్సింగ్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

యాచారం: అథారిటీలో నగదు జమ చేసిన పట్టా భూములకు గురువారం అధికారులు ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. ఫార్మాసిటీకి ఇవ్వని 2,211 ఎకరాల పట్టా భూములకు అవార్డులు జారీ చేసి పరిహారం సొమ్మును అథారిటీలో జమ చేశారు. ఈ భూముల రికార్డులను టీజీఐఐసీ పేరిట మార్చేశారు. సదరు రైతులు పరిహారం ఎందుకు స్వీకరించడం లేదో చెప్పాలని ఇటీవల సీసీఎల్ఏ నుంచి నోటీసులు సైతం ఇచ్చారు. రైతులు తమ అభ్యంతరాలు చెప్పకముందే అధికార యంత్రాంగం ఆ భూములను తమ ఆధీనంలోకి తీసుకుని చుట్టూ కంచె వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో 150 మందికి పైగా పోలీస్, రెవెన్యూ, టీజీఐఐసీ సిబ్బంది పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయి. రైతులను ఆ దరిదాపుల్లోకి రాకుండా కట్టడి చేశారు. నానక్‌నగర్‌లో కొంత మంది రైతులు మేము ఫార్మాసిటీకి భూములు ఇవ్వలేదు.. పరిహారం తీసుకోలేదు.. రికార్డులు మార్చేశారు.. అన్యాయంగా భూములు లాక్కోవడం సరికాదంటూ అధికారులను నిలదీశారు. అభ్యంతరాలుంటే సీసీఎల్ఏ నుంచి నోటీసులు వచ్చిన తేదీల్లో వెళ్లి సమాధానం ఇవ్వాలని.. పనులు అడ్డుకుంటే అరెస్టు చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బందోబస్తును చూసిన రైతులు సైతం వెనకడుగు వేశారు.

పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

నానక్‌నగర్‌లో పట్టా భూములకు సంబంధించిన ఫెన్సింగ్ పనులను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, యాచారం తహసీల్దార్ అయ్యప్ప, టీజీఐఐసీ అధికారులతో సమావేశమయ్యానారు. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా పనులు పూర్తి చేయాలన్నారు. సీసీఎల్ఏ నోటీసులపై రైతులు అభ్యంతరాలు తెలిపితే అథారిటీ ఆదేశాలను పాటించేలా కృషి చేస్తామన్నారు. ఏ రైతుకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు.

చీరలొచ్చాయ్..

- బతుకమ్మ పండుగ కానుకగా ఇందిరమ్మ చీరలు
- పొదుపు సంఘాల మహిళలకు అందజేసేందుకు ఏర్పాట్లు
- అక్కా చెల్లెళ్లకు మీ రేవంత్ అన్న కానుక పేరిట పంపిణీ

స్వయం సహాయక సంఘాల వివరాలు	
పొదుపు సంఘాలు	19,353
సభ్యులు	2,07,091
మున్సిపల్, కార్పొరేషన్ సంఘాలు	9,808
సభ్యులు	92,177



షాద్‌నగర్: స్వయం సహాయక సంఘాల మహిళలకు దసరా కానుకగా చీరలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఇందిరా మహిళా శక్తి పేరిట అక్కా చెల్లెళ్లకు మీ రేవంత్ అన్న కానుక చీరలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం ప్రతి దసరాకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి సారిగా బతుకమ్మ పండుగ చీరలు ఇవ్వాలని నిర్ణయించింది.

సభ్యత్వం ఉన్న మహిళలకు పంపిణీ

గత ప్రభుత్వ హయాంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసేవారు. రేషన్‌కార్డులో పేరు ఉన్న 18 ఏళ్లు నిండిన మహిళలకు వివిధ రంగుల్లో చీరలను అందించారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారికి మాత్రమే చీరలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల్లో ఉన్న ప్రతీ సభ్యురాలికి దసరా కానుకగా రెండు చీరల చొప్పున పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యే నాటికి మహిళా సంఘాల సభ్యులకు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రేవంతన్న కానుకగా ప్రతీ సంఘం సభ్యులకు చీరలను అందించనున్నారు. అయితే బతుకమ్మ పండగకు ముందుగా ఒక చీర ఆతర్వాత రెండు నెలలకు మరో చీరను పంపిణీ చేయనున్నారు.

ఒక్కో చీరకు రూ.800

గతాని కంటే భిన్నంగా ప్రభుత్వం బతుకమ్మ చీరలను తయారు చేయించిందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో చీరకు సుమారు రూ.800 ఖర్చు అయిందని అధికారులు తెలిపారు. జిల్లాకు ఇప్పటి వరకు 1.55లక్షల చీరలు వచ్చాయని వీటిని సర్దార్‌నగర్, కందుకూరు మార్కెట్ యార్డుల్లోని గోదాముల్లో నిల్వ ఉంచామని చెప్పారు. త్వరలో నియోజకవర్గాల వారీగా పంపిణీ చేయనున్నారు.

అర్హుల గుర్తింపు

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, గ్రామ సంఘం అధ్యక్షుడు, వీఓఏలు అర్హులను ఎంపిక చేసి అనంతరం చీరలను పంపిణీ చేయనున్నారు. మున్సిపాలిటీల్లో మెప్మా సిబ్బందికి, గ్రామ స్థాయిలో ఐకేపీ సిబ్బందికి చీరల పంపిణీ బాధ్యతలను అప్పగించనున్నారు.

> **పంపిణీకి ఏర్పాట్లు**
>
> దసరా కానుకగా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు బతుకమ్మ చీరలను అందజేస్తుంది. ఇప్పటి వరకు జిల్లాకు ఇప్పటి వరకు 1,55లక్షల చీరలు వచ్చాయి. వీటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.
>
> – శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ

రైతులకు రాయితీ

- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేశ్
- కూరగాయలు, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న సురేశ్

కడ్తాల: కూరగాయలు పండించే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రెయిన్ ఫాల్ ఏరియా డెవలప్‌మెంట్ పథకం, ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రెయిన్ ఫాల్ ఏరియా డెవలప్‌మెంట్ పథకం కిం రూ.30 వేలు రాయితీ ఇస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. కొంత నగదుతో పాటు కూరగాయల బుట్టలు, వర్మిబెడ్స్, తేనెటీగ బాక్స్ తదితరాలు వస్తురూపంలో అందిస్తోందని వివరించారు. అర్హులైన రైతులు ఖచ్చితంగా కూరగాయలు పండిస్తూ పాడి పశువులు కలిగి ఉండాలని చెప్పారు. ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు అధిక దిగుబడులు పొంది ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ సాగును ప్రోత్సహించేందుకు మొక్కలకు 90 శాతం, డ్రిప్ ఇరిగేషన్‌కు 80-100 శాతం రాయితీ, మొక్కలు నాటిన తర్వాత నాలుగు సంవత్సరాల పాటు ఎకరాకు రూ.4,200 నగదు అందజేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి సౌమ్య, వ్యాల్యూ ఆయిల్ వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావు, ఏరియా మేనేజర్ ప్రమోద్, హెచ్ఈఓ ప్రవాన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

హలో ఆఫీసర్!



యూనిఫాంలో ఉన్న చిన్నారితో సీపీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: అది గురువారం ఉదయం .. జలవిహార్‌లోని ఆడిటోరియం.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అప్పుడే ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్-2025ని ప్రారంభించారు. ఆయనకు వీడ్కోలు పలికిన పోలీసు అధికారులు తదుపరి కార్యక్రమం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నోటి వెంట 'హలో ఆఫీసర్' అనే మాట వచ్చింది. ప్రొటోకాల్ ప్రకారం అందరు అధికారులూ ముందుగానే అక్కడికి చేరుకున్నారు. అందరి పలకరింపులు పూర్తయ్యాయి. ఈ సమయంలో కొత్తగా ఎవరు వచ్చారా? అన్నట్లు ఉన్నతాధికారుల కళ్లు ఆ 'ఆఫీసర్' కోసం వెతికాయి. ఆ సమీపంలో యూనిఫాంలో నిల్చున్న చిన్నారి నడింపల్లి వశిష్ట రామ్‌ని చూసి మురిసిపోయారు. జలవిహార్ ఎండీ ఎన్వీ రామరాజు ట్రాఫిక్ సమ్మిట్ నేపథ్యంలో తన మనవడు వశిష్ట రామ్‌కు పోలీసు యూనిఫాం వేసి తీసుకు వచ్చారు. కొత్వాల్ ఆనంద్‌తో పాటు ఉన్నతాధికారులూ ఆ చిన్నారిని దగ్గరకు తీసుకుని సరదాగా మాట్లాడారు.

మెరుగైన సేవలు అందించండి



నియామకపత్రం అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు తదితరులు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సంబంధిత వైద్యులకు సూచించారు. గురువారం ఆయన శివరాంపల్లిలోని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా తడకంటి శృతి, రాజేంద్రనగర్ మండలం పాండురంగానగర్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా డి.శ్వేత, అబ్దుల్లాపూర్‌మెట్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా కె.శ్రీనివాస్, మీర్‌పేట యూపీహెచ్‌సీ డాక్టర్‌గా అఖిల శ్రీనిధి, ఉప్పర్‌పల్లి యూపీహెచ్‌సీ డాక్టర్‌గా హాస్నా ఫాతిమా, శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ డాక్టర్‌గా ఎండీ అవైస్‌కు ఆయన నియామక పత్రాలను అందజేశారు. కొత్తగా విధుల్లో చేరనున్న డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో రూ.52 వేల జీతంతో ఏడాదిపాటు ఈ డాక్టర్లు విధులు నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, పరిపాలనాధికారి మహ్మద్ షఫీయుద్దీన్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అక్రం, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



చంద్రయ్య మృతదేహం

షాబాద్: విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతిచెందిన ఘటన షాబాద్ పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఊబగుంట గ్రామానికి చెందిన బుడ్డమోళ్ల చంద్రయ్య(60) రోజు మాదిరిగానే ఉదయం పొలానికి వెళ్లాడు. వరి పంటకు నీరు పెట్టేందుకు మోటారు ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చేవెళ్ల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు దరశథ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

నామినేషన్లకు నేడే ఆఖరు

- మదర్ డెయిరీ డైరెక్టర్ ఎలక్షన్లకు ఇప్పటికే పది నామినేషన్లు దాఖలు
- రేపు పరిశీలన
- 27న పోలింగ్



నామినేషన్ వేస్తున్న మహిళా అభ్యర్థి

హయత్‌నగర్: నల్గొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్(నార్ముల్ మదర్ డెయిరీ) పాలక మండలి డైరెక్టర్ల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని ఎలక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెలలో ముగ్గురి పదవీకాలం ముగియనుందని, ఈ స్థానాల కోసం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, అనంతరం పోటీలో ఉన్నవారి పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. సోమవారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉన్నవారి తుది జాబితాను విడుదల చేస్తామని, పోటీ లేకపోతే వెంటనే ఏకగ్రీవమైన వారి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. పోటీ ఉంటే ఈనెల 27న హయత్‌నగర్‌లోని ఎస్వీ గార్డెన్స్‌లో ఉదయం 8నుంచి సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఇప్పటికే పది నామినేషన్లు

మదర్ డెయిరీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో పోటీ చేసేందుకు గురువారం పది నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. జనరల్ మహిళ స్థానానికి రెండు, రెండు జనరల్ స్థానాలకు ఎనిమిది నామినేషన్లు వచ్చాయన్నారు.

ట్రిపుల్‌ఆర్ బాధితులకు న్యాయం

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బాధిత రైతులకు నష్టం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని చెప్పారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలను కలిపే రోడ్లను ఆధునీకరించాలని, ట్రిపుల్ ఆర్ బాధిత రైతులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ప్రకటించారని దీనిపై పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన ఆందోళనలు, రైతుల ఆవేదనల గురించి ముఖ్యమంత్రికి వివరించామన్నారు. బాధిత రైతులకు నష్టం జరగకుండా ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం అందించాలని కోరామని చెప్పారు. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, బాధిత రైతులకు నష్టం జరగకుండా చూస్తామని ఎమ్మెల్యే వివరించారు. అంతకుముందు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయికి పది పాఠశాలలు

జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాలో డీఈఓ సుశీందర్‌రావు

తుక్కుగూడ: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేలా బోధనోపకరణాలు ఉండాలని డీఈఓ సుశీందర్ రావు సూచించారు. గురువారం మున్సిపల్ కేంద్రంలోని దేవేంద్ర విద్యాలయంలో జిల్లా స్థాయి బోధనోపకరణాల ప్రదర్శన (టీఎల్ఎం మేళా) ఏర్పాటు చేశారు. ఈ మేళాకు హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయని చెప్పారు. తరగతి గదిలో విద్యార్థికి టీఎల్ఎంతో బోధన చేస్తే ఆ విషయాన్ని జీవితకాలం గుర్తు పెట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. టీఎల్ఎంలో ప్రదర్శించిన వినూత్న అంశాలను తయారు చేసి ప్రదర్శించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి టీఎల్ఎం మేళాకు పది పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభ కనభరించేలా బోధనోపకరణాలను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కస్నానాయక్, కృష్ణయ్య, శంకర్‌నాయక్, చంప్లానాయక్, జయచందర్‌రెడ్డి, వెంకటేశ్, అరుణ్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



కొందుర్గు: ద్వితీయ బహుమతి అందుకుంటున్న చౌదరిగూడ హెచ్ఎం నీలా మోహన్‌నాయక్

చౌదరిగూడ ప్రాథమిక పాఠశాలకు ద్వితీయ బహుమతి

కొందుర్గు: వర్ణమాల, ద్విత్వాక్షరాలు, సంయుక్త, సంశ్లేష అక్షరాలు, భాషాభాగాలపై సిద్ధం చేసిన బోధనాభ్యాసన సామగ్రి ప్రదర్శనకు గాను చౌదరిగూడ ప్రాథమిక పాఠశాలకు జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి లభించింది. ఈ నెల 15న మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించుకున్న ఈ పాఠశాల గురువారం జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా డీఈఓ సుశీందర్‌రావు హెచ్ఎం నీలా మోహన్ నాయక్‌కు బహుమతి అందజేశారు.

చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాంచందర్



మాట్లాడుతున్న రాంచందర్

మీర్‌పేట: ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి నేటి పాలకులు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుబ్బాక రాంచందర్ అన్నారు. బాలాపూర్ మండల సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మీర్‌పేట కూడలిలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సభకు రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతం పేరుతో జరిగిన పోరాటం కాదని, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే నాడు సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని వివరించారు. నాడు కమ్యూనిస్టులు ఎందరో అమరులయ్యారని, వారి పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, 3 వేలకు పైగా గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసిన చారిత్రాత్మకమైన పోరాటమని గుర్తుచేశారు. నేటి యువతను పక్కదారి పట్టించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, తెలంగాణ గడ్డపై మత రాజకీయాలు సాగనివ్వమని ఆయన హెచ్చరించారు. సభలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గోరెంకల నర్సింహ, పార్టీ మండల కన్వీనర్ ఎం.యాదయ్య, నాయకులు దాసరి బాబు, ప్రకాశ్‌రెడ్డి, వి.శేఖర్‌యాదవ్, ఎలిషా, సుంకోజు యాదగిరి చారి, టీవీకే.రాజు, ఆర్.ధనంజయ, ఎస్.వెంకయ్య, కిషన్, మల్లికార్జున్, మోహన్ పాల్గొన్నారు.

వరద నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి



మొహ్మద్ షరీఫుద్దీన్ (ఫైల్)

అమీర్‌పేట: అమీర్‌పేట మైత్రివనం ప్రాంతంలో బుధవారం రాత్రి వరద నీటిలో ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందాడు. బల్కంపేట అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు ముషీరాబాద్‌కు చెందిన మొహ్మద్ షరీఫుద్దీన్ (26)గా గుర్తించారు. వరద నీటిలో కొట్టుకుపోతున్న షరీఫుద్దీన్‌ను స్థానికులు చూశారు. చిమ్మచీకటి ఉండటంతో సెల్‌ఫోన్ లైట్ల సాయంతో వెలికితీశారు. షరీఫుద్దీన్ తలకు ఉన్న హెల్మెట్‌ను తీసి సీపీఆర్ చేసి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ట్రాఫిక్ ఎస్సై శ్రీరాములు సైతం నీటిలో కొట్టుకుపోతున్న బాధితుడిని కాపాడేందుకు యత్నించినా లాభం లేకపోయింది. షరీఫుద్దీన్ బాలానగర్‌లోని జైపూర్ ఫుట్ కృత్రిమ కాళ్లు, చేతుల తయారీ కంపెనీలో 5 నెలలుగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా మృత్యువాత పడ్డాడు. మృతుడి సోదరుడు మొహ్మద్ బిలాల్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాట్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి అవసరం

సాక్షి, సిటీబ్యూరో: భారీవర్షాల నేపథ్యంలో హాట్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జూమ్ మీటింగ్‌లో అధికారులతో మట్లాడారు. వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న 2 రోజుల్లో ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపు, సివర్ జెట్టింగ్ యంత్రాల ఆపరేషన్లను ఆయా డీజీఎంలు తనిఖీ చేయాలన్నారు. రహదారులపై ఉన్న మ్యాన్ హోళ్ల వద్ద సీవరేజీ ఓవర్ ఫ్లో పై వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మ్యాన్ హోల్ మూతలను తెరవకూడదని సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి పైకి లారీ దూసుకెళ్లిన సంఘటన శంకర్‌పల్లి పట్టణ చౌరస్తాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌కి చెందిన లక్ష్మయ్య(50) పూల దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి వేళ శంకర్‌పల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా.. పటాన్ చెరు నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్న లారీ అతివేగం, అజాగ్రత్తగా వచ్చి ఆయన్ని వెనక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. స్థానికులు వెంటనే సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి, తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియాకి తరలించారు. అక్కడే గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంటశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



జరిమానా రసీదును అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శంకర్‌పల్లి: హోటళ్లు, తినుబండరాల దుకాణాల్లోని వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శంకర్‌పల్లి మున్సిపాలిటీ పర్యావరణాధికారి ఆనంద్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రామంతాపూర్‌లో గల శ్రీ బాలాజీ మిఠాయి భండార్‌ని సిబ్బందితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండడంతో రూ.5 వేల జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ.. మళ్లీ వచ్చి పరిశీలిస్తామని, నిర్వహణ తీరును మార్చుకోవాలని సూచించారు. తనిఖీల్లో సిబ్బంది హరిదాసు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతోంది



కందుకూరు మండలం గుమ్మడవెల్లిలో పగిలిన మిషన్ భగీరథ పైపులైన్



యాచారం ఎస్సీకాలనీలో ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న స్థానికులు

మిషన్ భగీరథ నీళ్లు బంద్
- పైపుల మరమ్మతులతో వారం రోజులుగా నిలిచిన సరఫరా
- ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్ డివిజన్లలో నీటి గోస
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలం

యాచారం: మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోవడం.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రస్తుతం గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. పైపులైన్ మరమ్మతులతో మిషన్ భగీరథ నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో అధికారులు చేతులెత్తేయడంతో స్థానికులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. దీంతో వ్యవసాయ బోరుబావుల వద్ద, రూ.వేలాది ఖర్చు చేసి నీటి ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుని దాహార్తీ తీర్చుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, షాద్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని దాదాపు 300కి పైగా గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోయాయి. ఈ అంతరాయంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

గౌరీదేవిపల్లి వద్ద పైపులైన్ పగిలి

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వచ్చే కృష్ణాజలాల పైపులైన్ నాలుగు రోజుల కింద నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని గౌరీదేవిపల్లి వద్ద పగిలిపోయింది. దాని మరమ్మతులు చేయడానికి నాలుగు రోజులు పట్టింది. ఆ తర్వాత ఏదో విధంగా ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేయగా కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని కర్కలపహాడ్ సమీపంలో, షాద్‌నగర్ నియోజకవర్గం వెళ్లే పైపులైన్ పగిలిపోయింది. దీంతో షాద్‌నగర్ ప్రాంతానికి, ఇటు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ డివిజన్లకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. నాలుగు డివిజన్లలోని దాదాపు 300కి పైగా గ్రామాలకు నిత్యం సరఫరా అయ్యే 400 లక్షల లీటర్ల సరఫరా నిలిచిపోవడంతో లక్షలాది మంది నీటి గోసతో ఇబ్బంది పడుతున్నారు. కర్కల్‌పహాడ్‌లో మంగళవారం సాయంత్రం పగిలిపోయిన పైపులైన్ మరమ్మతులు చేయగా, బుధవారం ఇబ్రహీంపట్నం డివిజన్‌కు నీటి సరఫరా అయ్యే కందుకూరు మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో పైపు లైన్ పగిలిపోవడంతో కథ మొదటికి వచ్చింది.

పైపులు పగిలితే గోసే

మిషన్ భగీరథ నీటి సరఫరా చేసే పైపులైన్ పగిలిపోయిన, పైపులు లీకేజీలైన జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గ్రామాల్లో రూ.లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన బోరుబావులు, చేతిపంపులు ఉన్నా ప్రయోజనం ఉండడం లేదు. గత బీఆర్‌ఎస్ హయాం నుంచి గ్రామాల్లోని ప్రజలకు పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీటి సరఫరానే చేస్తుంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ బాధ్యత మర్చిపోయారు. బోరుబావుల్లో పుష్కలంగా భూగర్భ జలాలున్నా మోటార్ల మరమ్మతులతో నిరుపయోగంగా మారాయి. మిషన్ భగీరథ నీటి సరఫరాతో కొన్ని గ్రామాల్లో రూ.లక్షలాది విలువ చేసే మోటార్లను ఎత్తుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి దాహార్తీ తీర్చాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పత్తా లేకుండా పోయారు. ఇదే విషయమై మిషన్ భగీరథ నీటి సరఫరా విభాగం పర్యవేక్షకుడు ప్రణయ్‌ని సంప్రదించగా.. గౌరీదేవిపల్లి, కర్కల్‌పహాడ్, గుమ్మడవెల్లిలో పైపు లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, మరమ్మతులు చేసి త్వరితగతిన నీటి సరఫరా పునరుద్ధరణ చేస్తామని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిర్వహణలో కీలక ఎంఓయూలు

మ్యాప్స్ మై ఇండియా, ఐఐఐటీ హైదరాబాద్‌తో ఒప్పందాలు



ఒప్పంద పత్రాలు చూపుతున్న గవర్నర్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చడంతో పాటు రహదారి భద్రతను పెంపొందించడం, వాహన చోదకులకు రియల్ టైమ్ సమాచారం అందించడమే ప్రధాన లక్ష్యాలుగా హైదరాబాద్ పోలీసులు రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. గురువారం జలవిహార్ ఆడిటోరియంలో ప్రారంభమైన ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్-2025లో భాగంగా, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సమక్షంలో ఇరువర్గాలు ఎంఓయూలు చేసుకున్నాయి. మ్యాప్స్ సంస్థ మ్యాప్ ఆధారిత సేవలతో పాటు మొబైల్ అప్లికేషన్‌ను అందించనుంది. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం ఏర్పాటు చేసుకుని పని చేసే ఈ సంస్థ రహదారులపై ఉన్న ట్రాఫిక్ స్థితిగతుల్ని రియల్ టైమ్‌లో ఎప్పటికప్పుడు అందిస్తుంది. ట్రాఫిక్ జామ్స్‌తో పాటు నిరసనలు, ర్యాలీలు జరుగుతున్న ప్రాంతాలు, ప్రముఖుల కదలికలు, రహదారుల మూసివేత, దారి మళ్లింపు తదితర అంశాలను వాహన చోదకులకు అందిస్తుంది. తమ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నగరంలోని బ్లాక్‌స్పాట్స్, ప్రమాదకరమైన టర్నింగ్స్, స్పీడ్ లిమిట్స్ సమాచారం, యాక్సిడెంట్స్‌కు అవకాశం ఉన్న ప్రాంతాలను మ్యాప్స్ ద్వారా సూచిస్తుంది. మ్యాప్స్ మై ఇండియా ప్లాట్‌ఫామ్స్ వినియోగిస్తున్న వాహనచోదకులు ప్రమాణం ప్రారంభ-ముగింపు ప్రాంతాలను ఫీడ్ చేసుకుంటే... ఆయా మార్గాల్లో ఉన్న ట్రాఫిక్ స్థితిగతుల్ని అధ్యయనం చేస్తూ అవసరమైతే వాహనచోదకులకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తుంది. పార్కింగ్ జోన్లు, వాటర్ లాగింగ్ ఏరియాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఫెయిల్యూర్స్, ప్రమాదాలపై అప్రమత్తం చేస్తుంది. మరోపక్క ఐఐఐటీ హైదరాబాద్‌తోనూ హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, హైదరాబాద్ పోలీసులు మరో కీలక ఒప్పందం చేసుకున్నారు. నగరంలో ఉన్న హాట్‌స్పాట్స్, రహదారులు స్థితిగతులు, ట్రాఫిక్ జామ్స్ జరుగుతున్న ప్రాంతాలతో పాటు ఆ సంబంధిత ఇబ్బందుల పైనా ఐఐఐటీ నిపుణులు అధ్యయనం చేస్తారు. వీటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తారు. రహదారి భద్రత అంశాలు, ట్రాఫిక్ నిబంధనల పైనా నగరవాసులకు అవగాహన కల్పించడంలో ఐఐఐటీ హైదరాబాద్ సహకరించనుంది.

74 కి. మీ. దూరం కొట్టుకుపోయి..

నాలాలో గల్లంతైన అర్జున్ ఆచూకీ లభ్యం
- వలిగొండ వద్ద మూసీలో మృతదేహం
- రామా కోసం గాలిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందాలు



నాంపల్లి: నగరంలోని అఫ్జల్‌సాగర్ నాలా వరద నీటిలో అయిదు రోజుల క్రితం గల్లంతైన మాన్గార్ బస్తీ యువకుడు అర్జున్ (26) నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద మూసీలో మృతదేహమై తేలాడు. ఈ నెల 14న రాత్రి మామా అల్లుళ్ల రామా, అర్జున్ అఫ్జల్‌సాగర్ నాలాలో గల్లంతైన విషయం తెలిసిందే. వీరి కోసం జీహెచ్‌ఎంసీ, హైడ్రా బృందాలు గాలింపు చేపట్టాయి. అయిదు రోజుల తర్వాత నల్లగొండ జిల్లా వలిగొండ సమీపంలోని మూసీ నదిలో ఉన్నట్లు సహాయక సిబ్బంది కనుగొన్నారు. రామా (25) మృతదేహం లభించలేదు. డీఆర్‌ఎఫ్ బృందాలు రామా ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. అర్జున్ మృతదేహం గ్రేటర్ హైదరాబాద్ నుంచి 74 కిలో మీటర్ల దూరం కొట్టుకుపోయింది. మృతుడు అర్జున్‌కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై గురువారం రాత్రి కారు బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వెళుతున్న ఓ కారు పిల్లర్ నంబర్ 162 వద్దకు రాగానే వర్షం కారణంగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని అక్కడి నుంచి తరలించారు. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు. ఘటనలో ఎవరికి ఎగాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతుండగా ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు దాడి చేసి, ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. రావిర్యాల సమీపంలోని మైల్ స్టోన్ వెంచర్‌లో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సుజీవన్, తిరుపతయ్య, మహేష్, శేఖర్, సురేష్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.13,250 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పూరీ చట్నీ కోసం గొడవ..

- చికిత్స పొందుతూ ఒకరు మృతి
- జైలుపాలైన ఐదుగురు

శంకర్‌పల్లి: ఓ హోటల్‌లో పూరీ చట్నీ కోసం మొదలైన గొడవ.. చివరికి ఓ నేపాల్ వాసి మృతికి కారణమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వేణు అనే వ్యక్తి హోటల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇతనివద్ద నేపాల్‌కు చెందిన దిలీప్(19), గౌతమ్ (30) మాస్టార్లుగా పని చేస్తున్నారు. ఈనెల 9న ఉదయం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మారెపల్లితండాకు చెందిన కూలీలు నేనావత్ లక్ష్మీబాయి(40), పవర్ సంతోష్(48), బుజ్జి(43) అనే ముగ్గురు వ్యక్తులు వేణు హోటల్‌కు వెళ్లారు. టిఫిన్ చేస్తున్న క్రమంలో పదేపదే పూరీలోకి చట్నీ కావాలని అడగడంతో సిబ్బంది విసిగిపోయారు. పూరీకి ఇంతే చట్నీ వస్తుందని తేల్చిచెప్పడంతో గొడవకు దిగారు. చుట్టు పక్కల వారు వచ్చి సర్ది చెప్పడంతో వెళ్లిపోయారు. మధ్యాహ్నం వేళ ఆముగ్గురూ మరో ఇద్దరు నేనావత్ అరవింద్(20), మాలవత్ రవి(20)తో కలిసి హోటల్‌కు వచ్చారు. అక్కడే చేతికి దొరికిన రాయితో దిలీప్‌పై తలపై, కూరగాయలు కోసే కత్తితో గౌతమ్‌పై దాడి చేశారు. దిలీప్ తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ దిలీప్ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ప్రస్తుతం గౌతమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిసింది. దాడికి పాల్పడిన ఐదుగురిని గురువారం అదుపులోకి తీసుకున్న శంకర్‌పల్లి పోలీసులు, వారిని సంగారెడ్డి జిల్లాలోని కంది జైలుకి తరలించారు.

హెల్మెట్టే నా ప్రాణాలను కాపాడింది

ట్రాఫిక్ సమ్మిట్‌లో నటుడు సాయి ధరమ్ తేజ

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై ప్రమాదానికి గురైనప్పుడు తన ప్రాణాలను హెల్మెట్టే కాపాడిందని సినీ నటుడు సాయి ధరమ్ తేజ అన్నారు. జలవిహార్ ఆడిటోరియంలో జరుగుతున్న ట్రాఫిక్ సమ్మిట్-2025కు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోలుకోవడానికి చాలా సమయం పట్టిందని అన్నారు. ఎలాంటి మినహాయింపులు లేకుండా ద్విచక్ర వాహనచోదకులందరూ హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. యువకులు ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, రహదారులపై స్టంట్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ వాహనచోదకుడినే కాకుండా ఆ కుటుంబం మొత్తాన్ని రక్షిస్తుందని అభిప్రాయపడ్డారు. సర్వకాల సర్వావస్థల్లోనూ హైదరాబాద్ పౌరుల భద్రత, సౌకర్యం కోసం పని చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు, మార్షల్స్‌ను ఆయన కొనియాడారు. ప్రతి ఒక్కరూ దయచేసి హెల్మెట్ ధరించండి, ట్రాఫిక్ నియమాలు పాటించండి, జీవితాన్ని విలువైందిగా పరిగణించండి.. మీతో పాటు ఇంట్లో మీ కోసం వేచి ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకోండి అంటూ సాయి ధరమ్ తేజ హితవు పలికారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

16.16 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: ఒడిశా నుంచి ముంబైకి గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి రూ.8.08 లక్షల విలువైన 16.16 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, జీఆర్‌పీ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు బీ.సాయీశ్వర్‌గౌడ్, బీఎస్ సారస్వత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముంబై వడాలా ఈస్ట్‌కు చెందిన అసీరుద్దీన్ తక్రిద్దీన్‌ఖాన్ కూలీగా పని చేసేవాడు. మాదకద్రవ్యాలకు బానిసైన అతను పలు నేరాలకు పాల్పడటంతో ముంబై పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటికి వచ్చిన అసీరుద్దీన్‌కు ముంబైలో ఉంటున్న ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. వారి ద్వారా ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి వ్యాపారం చేసుకోవాలని భావించిన అసీరుద్దీన్ భువనేశ్వర్ వెళ్లాడు. రూ.1.13 లక్షలు చెల్లించి గంజాయి కొనుగోలు చేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ముంబైకి బయలుదేరాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలులో పోలీసులు ప్రయాణికుల లగేజీని తనిఖీ చేస్తుండగా గంజాయి రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్‌ఐ (డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు అక్రమంగా విదేశాల నుంచి తరలిస్తున్న బంగారాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల (ఆగస్టు) 22న విదేశాల నుంచి వచ్చిన రెండు వేర్వేరు లగేజీ బ్యాగులను సంబంధిత ప్రయాణికులు ఎవరూ క్లెయిమ్ చేయలేదు. దీంతో లగేజీలను పరిశీలించిన అధికారులు వాటిని తెరిచి 3379.600 గ్రాముల బంగారం బయట పడింది. బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.3.36 కోట్లుగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కువైట్ నుంచి ఈ బంగారాన్ని కడపకు చెందిన ఇద్దరు వేర్వేరు వ్యక్తులు క్యారియర్‌లుగా తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో రెండు భారీ స్కైవాక్‌లు!

- సికింద్రాబాద్ ఈస్ట్-వెస్ట్ మెట్రో స్టేషన్లను కలుపుతూ మధ్య ఒకటి
- జేఎన్‌టీయూ 'మెట్రో' నుంచి వర్సిటీ మీదుగా లూలూ మాల్‌కు మరొకటి
- అమీర్‌పేటలో పైలట్ ప్రాజెక్ట్‌గా మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ విధానం
- ట్రాఫిక్ సమ్మిట్-2025లో ప్రకటించిన ఉమ్టా ఎండీ జీవన్ బాబు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించడంతో పాటు రహదారి భద్రతను పెంచడం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఉమ్టా) మేనేజింగ్ డైరెక్టర్ బి.జీవన్ బాబు అన్నారు. నగరంలోని జలవిహార్ ఆడిటోరియంలో జరుగుతున్న ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్- 2025కు ఆయన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్, జేఎన్‌టీయూ వద్ద నిర్మించనున్న భారీ స్కైవాక్‌లతో పాటు అమీర్‌పేట మెట్రో స్టేషన్ వద్ద పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ విధానాన్ని వివరించారు.

అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో..

నగరంలోని అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జేఎన్‌టీయూ చౌరస్తా ఉన్నాయి. వీటి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న బస్టాండ్లు, జన సంచారం, ప్రయాణికుల రాకపోకల నేపథ్యంలో అనునిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు, అనేకసార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. సికింద్రాబాద్‌లో రైల్వేస్టేషన్, మూడు కీలక బస్టాండ్లు, రెండు మెట్రో స్టేషన్లు ఉంటాయి. వీటన్నింటినీ అనుసంధానిస్తూ ఉమ్టా భారీ స్కైవాక్ నిర్మిస్తోంది. సికింద్రాబాద్ ఈస్ట్-వెస్ట్ మెట్రోస్టేషన్ల మధ్య ఉండే వంతెన.. రెతిఫైల్‌తో పాటు ఆ చుట్టపక్కల ఉన్న మరో రెండు కీలక బస్టాండ్లను అనుసంధానించనుంది. వీటి మధ్య రాకపోకలు సాగించే వాళ్లు రహదారిపైకి రావాల్సిన అవసరం లేకుండా మరో ప్రాంతాన్ని చేరుకునేలా దీన్ని డిజైన్ చేశారు.

వర్సిటీని కలుపుతూ లూలూ వరకు...

ట్రాఫిక్ జామ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న జేఎన్‌టీయూ చౌరస్తా మీదుగా జాతీయ రహదారి వెళ్తుంది. ఫలితంగా వాహనాలు గంటల తరబడి ఆగిపోవడంతో పాటు అనేక మంది పాదచారులూ ప్రాణాలు కోల్పోతుంటారు. ఆ సమీపంలో ఉన్న వాణిజ్య ప్రాంతాలు, యూనివర్సిటీలకు రాకపోకలు సాగించే వాళ్లూ పెద్ద సంఖ్యలోనే ఉంటాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఉమ్టా జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ పై నుంచి కిందికి దిగాల్సిన అవసరం లేకుండా యూనివర్సిటీలోకి వెళ్లడానికి.. ఈ రెండు ప్రాంతాల నుంచి ఎవరైనా నేరుగా సమీపంలోని లూలూ మాల్‌కు చేరుకోవడానికి అనువుగా ఉమ్టా ఈ స్కైవాక్ నిర్మిస్తోంది. లూలూ మాల్‌కు సైతం నిత్యం పెద్ద ఎత్తున వినియోగదారులు వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. స్కైవాక్‌కు అటు-ఇటు ఉన్న కీలక ప్రాంతాలను అనుసంధానించనుంది.

పైలట్ ప్రాజెక్టుగా అమీర్‌పేట మెట్రో వద్ద..

ఉమ్టా మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ అండ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ పేరుతో భారీ ప్రాజెక్టు చేపడుతోంది. రవాణా వ్యవస్థల అనుసంధానం, వాణిజ్య ప్రాంతాల తరలింపు, రహదారి భద్ర త ఇందులోని ప్రధాన ఉద్దేశాలు. దీనికి సంబంధించి పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే అమీర్‌పేట మెట్రో స్టేషన్‌ను ఎంచుకుంది. దాని చుట్టూ 500 మీటర్ల పరిధిలో వివిధ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పార్కింగ్ ప్రాంతాలు, ఫుట్ పాత్‌ల అభివృద్ధి చేపడుతోంది. త్వరలో సత్యం థియేటర్ సమీపంలో, అమీర్‌పేట మెట్రో వద్ద వెండింగ్ జోన్లను ఏర్పాటు చేయనుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాల అభివృద్ధి, రోడ్ మార్కింగ్స్, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా, వాహనాలు ప్రవేశించే అవకాశం లేకుండా ఏర్పాట్లు చేయనుంది.